క్లుప్తంగా

ఉచిత మెగా హెల్త్‌క్యాంప్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మీర్‌పేట: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయన్ భట్బాడ్ తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ గీతాంజలి జిల్లెలగూడ, మెడిసిటీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లెలగూడలోని లార్స్ స్కూల్‌లో మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. శిబిరంలో దాదాపు 300 మందికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి మందులను అందజేయడంతో పాటు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చినట్లు క్లబ్ అధ్యక్షుడు హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రెండవ గవర్నర్ మహేందర్ కుమార్‌రెడ్డి, రిజినల్ చైర్‌పర్సన్ ప్రభాకర్‌రెడ్డి, జోనల్ చైర్ పర్సన్ బీరం రాజేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల బీరప్ప, ఎనుగుల అనిల్‌యాదవ్, కిషోర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినులకు సన్మానం



విద్యార్థినులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

కందుకూరు: ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన విద్యార్థినులను మండల పరిధిలోని బాచుపల్లిలో గ్రామ మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించి, అభినందించారు. నేదునూరు మోడల్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన బాచుపల్లి విద్యార్థినిలు తేజశ్వి, శృతిలను శాలువాతో సత్కరించి, రూ.5 వేల చొప్పున నగదు పురస్కారం అందజేశారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కొంతం ప్రేమలతబాల్‌రెడ్డి, మహిళా నాయకురాలు తుమ్మ లూషమ్మ, మర్యాద జయమ్మ, గ్రామ పెద్దలు నాగేష్‌గౌడ్, పి.చంద్రశేఖర్‌గుప్తా, డి.విష్ణుమూర్తి, రాజమణి, ఉపాధ్యాయుడు ఆర్.ఎగౌడ్ పాల్గొన్నారు.

ప్రీతంకు సన్మానం



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న బి.జంగయ్య

బడంగ్‌పేట్: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతంను శనివారం పలువురు ఎస్సీ నాయకులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ కుటుంబాల ఆర్థిక బలోపేతానికి సహకారం అందించాలని కోరారు. సన్మానించిన వారిలో టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జంగయ్య, లగ్గాల మధు, మురళి, కుమార్, నంది శరత్ తదితరులున్నారు.

యువతి వివాహానికి సాయం

ఆమనగల్లు: మేడిగడ్డ తండాకు చెందిన సబావత్ వాలీ, అంజ్య నాయక్‌ల కుమార్తె శిరిష వివాహానికి మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్ శనివారం క్వింటాల్ బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్‌రాథోడ్, రాజ్‌కుమార్, రవీందర్, బిచ్చానాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

బలహీన వర్గాల నేతను గెలిపించండి

మాజీ మంత్రి,ఎమ్మెల్యే పి.సబితారెడ్డి

మహేశ్వరం: బడుగు, బలహీన వర్గాల నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో బీఆర్‌ఎస్ మండల ముఖ్య నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నాయకుడు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ప్రచారం చేయాలన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాగ్రామాన తెలియజేయాలన్నారు. జిల్లాకు జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఈ ప్రాంతానికి ఎంతగానో సేవ చేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల గొంతుకగా కాసాని వాణి పార్లమెంట్‌లో వినిపించేలా చేయాలని సూచించారు. 96 బీసీ కులాల ఐక్యవేదికను ఏర్పాటు చేసి అందరి ఐక్యతకు నిరంతరం కృషి చేసి వారి సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు. భవిష్యత్తులో బీఆర్‌ఎస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని, నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన వైద్యం అందించాలి

మహేశ్వరం: రోగులకు నాణ్యతతో కూడిన వైద్యాన్ని అందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో కల్వకోల్ మాజీ ఉప సర్పంచ్ బొజ్జం చంద్రయ్య యాదవ్ కుమారుడు డా.ప్రవీణ్, డా. స్రవంతి దంపతులు విజయ్ చంద్ర ఆస్పత్రిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివి వైద్య విద్యను అభ్యసించి డాక్టర్‌గా సొంత గ్రామంలో ఆస్పత్రి నిర్మాణం చేసి పేదలకు తక్కువ ఫీజుతో సేవలు అందించడం అభినందనీయమన్నారు. ముగ్గురు కుమారులు ప్రభుత్వ ఉద్యోగులుగా, ఒకరు డాక్టర్‌గా తయారు చేసిన చంద్రయ్యను ఎమ్మెల్యే అభినందించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో కల్వకోల్ మాజీ సర్పంచ్ గాదె థామస్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి,వెంకటేష్ యాదవ్, పర్వతాలు గౌడ్, అంబయ్య యాదవ్, రాజు నాయక్ పలువురు పాల్గొన్నారు.

అప్పులకుప్పగా తెలంగాణ

ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి తదితరులు

కందుకూరు: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్‌ఎస్ అప్పులకుప్పగా మార్చిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే పంథాను అవలంబిస్తుందని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బీజేపీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్య రంగాలను భ్రష్టు పట్టించారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు రూ.53 వేల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని, దేవుడిపై ప్రమాణాలు చేస్తూ మరోసారి లబ్ధిపొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. పథకాలు ఎవరూ అడగలేదని, నాణ్యమైన విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి మాత్రమే అడిగారన్నారు. దేశంలో మోదీ పాలనలో ఎలాంటి హామీ లేకుండానే ముద్రా ద్వారా రూ.50 లక్షల వరకు రుణాలు అందిస్తున్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని నరేంద్ర మోదీకి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ బూత్‌స్థాయి నుంచి కష్టపడి పని చేయాలని కోరారు.

అలిగిన ఎంపీపీ..

కాగా, తరచూ తనను అవమానించేలా మండల పార్టీ అధ్యక్షుడు పని చేస్తున్నాడని, స్టేజీపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో సైతం తమ ఫొటో ప్రోటోకాల్ ప్రకారం కాకుండా ఎంపీటీసీ సభ్యుల కింద ఏర్పాటు చేశారంటూ ఎంపీపీ మంద జ్యోతిపాండు, ఆమె భర్త దళితమోర్చా రాష్ట్ర నాయకుడు మంద పాండు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టేజి పైకి వెళ్లకుండా కార్యకర్తలతో పాటు కలిసి కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొలను శంకర్‌రెడ్డి, సుధాకర్‌శర్మ, ఎంపీటీసీలు ఎల్లారెడ్డి, మల్లేష్, బాల్‌రాజ్, జిల్లా, మండల నాయకులు సాధ మల్లారెడ్డి, పున్న భిక్షపతి, టి.జగదీశ్వర్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌గౌడ్, బొక్క సత్యనారాయణరెడ్డి, ఎ.సత్తయ్య, గౌర పర్వతాలు, గౌర ప్రభాకర్, ఊటు మహేందర్, నిమ్మ అంజిరెడ్డి, ఎన్.నర్సింహారెడ్డి, జిట్టా రాజేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బాబురావు, కె.సుధాకర్‌రెడ్డి, భాస్కర్, ఎ.పాండు తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీగా అమలు చేస్తాం

కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



రాచులూరులో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

కందుకూరు: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సరస్వతిగూడ, లేమూరు, రాచులూరు, గూడూరు, పులిమామిడి, నేదునూరు తదితర గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతుందన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లులు చెల్లించొద్దని, ఎన్నికల అనంతరం రూ.500కే గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తామన్నారు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని బీజేపీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు జూటా మాటలతో ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు అందరి సంక్షేమం కోసం పాటు పడేది ఒక్క కాంగ్రెస్ పార్టీ నేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేష్, రాష్ట్ర మహిళా నాయకురాలు నేరెళ్ల శారద, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, యూత్ అధ్యక్షుడు డి.నర్సింహాచారి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీతోనే సమన్యాయం

కందుకూరు: బీఆర్‌ఎస్ పార్టీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని మురళీనగర్, చిప్పలపల్లి, ధన్నారం, పులిమామిడి గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. 24 గంటల ఉచిత కరెంట్, రైతు బంధు, రైతుబీమా సకాలంలో అందాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంట్ కోతలు, రైతుబంధు వంటి పథకాలు అమలుకు నోచుకోక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎ.అంజయ్యగౌడ్, సీనియర్ నాయకులు కాకి దశరథ, దామోదర్‌గౌడ్, సామ ప్రకాష్‌రెడ్డి, జి.సామయ్య, పి.ఆనంద్, జంగయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



బడంగ్‌పేట్: బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు

బడంగ్‌పేట్: బీఆర్‌ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి జై తెలంగాణ నినాదాలు చేశారు. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలని రాంరెడ్డి కోరారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డితోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, దర్శన్, వెంకటేశ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అబద్ధపు హామీలను నమ్మొద్దు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గుప్పిస్తున్న అబద్ధపు హామీలను నమ్మొద్దని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ తొలిదశ ఉద్యమం నుంచి నేటి వరకు కాంగ్రెస్ హయాంలో రాష్ట్రానికి అడుగడుగునా మోసమే జరిగిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్‌ఎస్‌కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగరవేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తొలిదశ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో 369 మంది ఉద్యమకారులను కాల్చిచంపిన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. పెద్ద మనుషుల ఒప్పందం, ఫజల్‌అలీ కమిషన్ సిఫార్సులు, 610 జీవోల అమలుచేయకుండా కాంగ్రెస్సే మోసం చేసిందన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఉద్యమం చేసి 14 సంవత్సరాలు మడమతిప్పని పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ ఉద్యమాన్ని నీరుగార్చడానికి కాంగ్రెస్ ఎన్నో కుట్రలు పన్నిందని, ఉద్యమ పార్టీనీ నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిందని వివరించారు. కాంగ్రెస్ కుట్రలను ఛేదించి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పదేండ్లలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి, ఎంపీపీ కృపేశ్, యాచారం జెడ్పీటీసీ జంగమ్మ, మండల అధ్యక్షుడు బుగ్గరాములు, కిషన్‌గౌడ్, రమేశ్, రమేష్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు కొప్పు జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: మండల కేంద్రంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరామ్ నాయక్, చంద్రమౌళి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సుగుణ సాయిలు, హరిచంద్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

యాచారం: గ్రామాలకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన ప్రకారం.. మాల్ కేంద్రంలో నల్గొండ జిల్లా చింతపల్లి మండలం మదనాపూర్ గ్రామానికి చెందిన శివ వద్ద రూ.9,500 విలువైన మద్యం, గునుగల్ గ్రామంలో మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన రాజు వద్ద రూ.7వేల విలువైన మద్యం, తాడిపర్తి గ్రామంలో వెంకటమ్మ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4వేల విలువైన మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఓటు హక్కు వినియోగం బాధ్యత

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుష్పలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శనివారం ఓటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మహిళా సంఘాల్లోని సభ్యులంతా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు అన్నింట్లో ముందు ఉండాలని చెప్పారు. అందుకే ఓటుహక్కు అనేది మన బాధ్యతగా భావించాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వేయాలన్నారు. ఓటు వేయాల్సిన విధానంపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ సంధ్య, ఏపీఎం, సీసీలు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

తలకొండపల్లి: పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రాంపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మాదు రవీందర్‌రెడ్డి (60) ఉదయం 10 గంటల ప్రాంతంలో పొలం పొలం పనులకు వెళ్లాడు. సొప్ప కోస్తుండగా పాము కాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వచ్చి చూచేసరికి కాలుపై రెండు గాట్లు గుర్తించారు. పాము కాటు వేయడంతో రవీందర్‌రెడ్డి తల్లడిల్లి కొట్టుకున్నారని, దీంతో మోచేయి కండరాలు ఎర్రగా కందిపోయి ఉన్నాయన్నారు. మృతుడికి భార్య అనసూయ, నలుగురు సంతానం.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం



కాంగ్రెస్‌లో చేరుతున్న ఇతర పార్టీల నేతలు

మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం రేవంత్ రెడ్డికి కానుకగా ఇస్తామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన సుమారు వంద మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి స్వచ్ఛందగా చేరుతున్నారన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం ప్రజల కోసం పని చేసే, ఆపద వస్తే నేనున్నానని అదుకునే వ్యక్తి రంజిత్‌రెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే బురదలో వేసినట్లే అవుతుందన్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు తగిన ప్రాధాన్యం ఇచ్చి గౌరవిస్తామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాకేష్ రెడ్డి, కాకి ఈశ్వర్ ముదిరాజ్, యాదయ్య, రఘుపతి, సాదయ్య, సాబేర్, ఎర్ర యాదగిరి, కృష్ణ నాయక్, రాజు నాయక్ జంగయ్య, సంజీవ,అంజయ్య, పాపయ్య, వెంకటేశ్,రమేశ్ పలువురు పాల్గొన్నారు.

గాజుల కోసమే హత్య

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలైన నిందితుడు
- వృద్ధురాలిని చంపి.. బంగారు గాజులు చోరీ
- హత్య కేసును ఛేదించిన ఆదిబట్ల పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇటీవల జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులపాలైన తెలిసిన వ్యక్తే.. ఆమె చేతికి ఉన్న బంగారు గాజులను దొంగిలించేందుకు ఈ దురాగతానికి పాల్పడ్డాడు. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ రాఘవేందర్‌రెడ్డి, మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి శనివారం మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గడ్డం కళావతి(76) అనే ఓ వృద్ధురాలు నాదర్‌గుల్‌లోని తమ వ్యవసాయ క్షేత్రంలో నివాసం ఉంటోంది. కొడుకులు, బిడ్డలు వారానికోసారి వచ్చి చూసి వెళ్తుంటారు. ఇదిలా ఉండగా ఈనెల 18న కళావతి తన గదిలో మృతిచెంది ఉన్నట్లు స్థానికంగా ఉండే వారు గుర్తించారు. అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు మృతిపై అనుమానం వ్యక్తంచేయడంతో కేసు నమోదు చేసుకున్న ఆదిబట్ల పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా మృతికి ముందు రోజు స్కూటీపై ఓ వ్యక్తి వచ్చి వెళ్లినట్లు గుర్తించారు. వాహనం నంబర్ ఆధారంగా కేసును ఛేదించారు. కొంపల్లిలో ఉండే కళావతి చిన్నకూతురు రజిని వద్ద కారు డ్రైవర్‌గా పనిచేసే రత్న అశోక్‌రెడ్డి హత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. 17న రాత్రి 10 గంటల వరకు అశోక్‌రెడ్డి వృద్ధురాలి వద్దే ఉన్నాడు. చుట్టూ ఎవరూ లేరని గమనించి ఆమె చేతికి ఉన్న బంగారు గాజులు లాక్కునేందుకు ప్రయత్నించడంతో ప్రతిఘటించింది. ఈ క్రమంలో హంతకుడు ఆమెను బలంగా నెట్టడంతో పక్కనే ఉన్న మంచంపై పడిపోయింది. ఆవెంటనే వృద్ధురాలి ముఖంపై దుప్పటి వేసి చేతులతో గొంతు నొక్కాడు. చనిపోయిందని డిసైడైన తర్వాత చేతికి ఉన్న ఆరు బంగారు గాజులు తీసుకుని స్కూటీపై పారిపోయాడు.

అప్పుల పాలై.. హత్య చేసి

ఏడెనిమిది నెలలుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెడుతున్న నిందితుడు పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకున్నాడు. పలు లోన్ యాప్‌ల ద్వారా రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాడు. యాక్సిస్ బ్యాంకులో రూ.1.10 లక్షల లోన్ తీసుకుని ఆన్‌లైన్ జూదంలో పోగొట్టుకున్నాడు. లోన్లు చెల్లించే మార్గం లేకపోవడంతో వృద్ధురాలిని టార్గెట్‌గా చేసుకున్నాడు. ఆమె నుంచి దొంగిలించిన బంగారు గాజులను అమీర్‌పేట్‌లోని జెనకా గోల్డ్ కంపెనీలో అమ్మేసి రూ..3.96 లక్షలు తీసుకుని క్రికెట్ బెట్టింగ్‌లలో పోగొట్టాడు. శనివారం అశోక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నేరస్తుడు వాడిన వాహనం, సెల్‌ఫోన్, దుప్పటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ రాజు, సిబ్బంది సందీప్, శివచంద్రకు డీసీపీ సునీతారెడ్డి రివార్డులు అందజేసి అభినందించారు.

మానవ అక్రమ రవాణా అరికట్టండి



మాడ్గుల శిక్షణ కార్యక్రమంలో బలరామకృష్ణ, సురేశ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్స్

- ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ
- కో ఆర్డినేటర్ సురేశ్ కుమార్

మాడ్గుల: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, కోఆర్డినేటర్ సురేశ్ కుమార్‌లు పేర్కొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండో రోజు కూడా సూపర్ వైజర్లు జయమ్మ, పద్మలతో జ్యోతి ప్రజ్వలన చేసి శనివారం శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ, సురేశ్ కుమార్‌లు మాట్లాడుతూ నేటి సమాజం కొత్త పద్ధతుల ద్వారా సైబర్ ట్రాఫికింగ్ జరుగుతుందన్నారు. మొబైల్ ఫోన్లు వాడేవారు ఎవరైనా దీనికి గురయ్యే అవకాశం ఉందని ఆయన వివరించారు. ముఖ్యంగా యువతులు మొబైల్ ఫోన్లో రకరకాల యాప్‌ల ద్వారా లైంగిక వ్యాపారానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రవాణాపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు, నిరాక్ష్యరాస్యత కూడా అక్రమ రవాణాకు కారణమని అభిప్రాయ పడ్డారు. దీనికి సినిమా హీరోయిన్లు, రాజకీయ నాయకులు కూడా గురవుతున్నారన్నారు.